వైఎస్సార్ స్ఫూర్తితో జన రంజక పాలన

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి
- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

గుంతకల్లుటౌన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనే ధ్యేయంగా పుట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేద,బడుగు,బలహీన వర్గాలకు అండగా నిలిచింది. కుట్రలు, కుతంత్రాలను ఎదుర్కుంటూనే దేశంలో ఎక్కడా లేని విధంగా జనరంజక పాలన సాగిస్తుందని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవం ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేసి వందనం చేశారు. కేక్‌ను కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి వైఎస్సార్‌సీపీ శ్రీకారం చుట్టిందన్నారు. దేవుడి దయ, ప్రజల చల్లని దీవెనలతో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాల ను అమలు చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసే ఓటేయాలన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానానికి పార్టీ తరఫున బరిలో దిగిన వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎం.వీ.రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్.మోహన్, సీనియర్ నాయకులు యుగంధర్‌రెడ్డి, మల్లికార్జున శాస్త్రీ, ఎద్దుల శంకర్, కౌన్సిలర్లు దర్గా చెన్నమ్మ, ప్రభాకర్, వై.సుధాకర్, భాస్కర్, సుమోబాష, లింగన్న, మండల కన్వీనర్ మోహన్, వార్డు ఇన్‌ఛార్జ్‌లు మస్తాన్, టి.గోపి, రంగన్న, వీరేష్, సుంకప్ప, హరి, పార్టీ సచివాలయాల పట్టణ, మండల కన్వీనర్లు ఎండీ.ఖలీల్, గోవిందనాయక్, నాయకులు దేవేంద్రప్ప, సోమిరెడ్డి, జయరామిరెడ్డి,ఖలీఫా,మౌలా,అక్రమ్,సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



తాడిపత్రి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

రాష్ట్రాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

యాడికి: రాష్ట్ర అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయమనీ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రమేష్ నాయుడు స్వగృహంలో వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొంబాయి రమేష్ నాయుడు కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని 2011లో స్థాపించారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చటంతో ప్రజా సంక్షేమమే పరమావధిగా పార్టీ ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, వార్డు మెంబర్లు తిరుపతి, రామచంద్ర, బాల పెద్దయ్య పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

గుత్తి: పట్టణంలోని వసుధా ఫంక్షన్ హాల్లో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, గుంతకల్లు సీనియర్ నాయకులు రామలింగప్ప, రామాంజనేయులు, గుత్తి పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు చేపట్టారు. ఈసందర్భంగా భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను నాయకులు తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్‌యాదవ్, సీనియర్ నాయకులు రంగయ్య, సునీల్, దస్తగిరి, శివ, పగడాల శీనా, బేడల వెంకటరాముడు, అనగానదొడ్డి రాజు, వీరన్న, కౌన్సిలర్లు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ లక్ష్యం

తాడిపత్రి టౌన్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం హర్షవర్ధన్ రెడ్డి అధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా నాయకులు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం కల్పించారన్నారు. కులమతం వర్గం, పార్టీ అనే తేడా లేకుండా అర్హత కల్గిన అందరికీ సంక్షేమ ఫలాలను సీఎం జగనన్న అందజేసి ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్లూరులో..

పుట్లూరు: మండల కేంద్రంలో ఆదివారం వైఎస్సార్ సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధన కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రారంభించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



యాడికిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



గుత్తిలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పుట్లూరు: కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి

క్లుప్తంగా

ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని జడ్.వీరారెడ్డి కాలనీ సమీపంలో ఆదివారం బైక్‌పై నుంచి కింద పడి ఓవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. పుప్పాల తండాకు చెందిన రమేష్ నాయ పని మీద గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. జడ్.వీరారెడ్డి కాలనీ సమీపంలో బైక్‌పై నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శరత్‌చంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్యల నేతృత్వంలో శానిటేషన్ సిబ్బంది స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు మురుగుకాలువలు శుభ్రం చేశారు. చెత్తా చెదారాన్ని తొలగించారు. అపరిశుభ్రతను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శానిటేషన్ సిబ్బంది మురికి, చెత్తా చెదారం, అపరిశుభ్రత ఉన్న ప్రాంతాలతో పాటు దోమల ఆవాసాలు ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచేగాక జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఇలా చేయడం వల్ల కోర్కెలు తీరుతాయని ప్రజల నమ్మకం. స్వామిమూలవిరాట్ అడుగున ఉన్న నీటిని భక్తులు బాటిళ్లలో తీసు కెళ్లారు. ఈనీటిని సేవిస్తే సకల రోగాలు నివారణ అయితాయని ప్రజల ప్రగాఢ విశ్వాసం.

బంకు ఏర్పాటు అడ్డగింత

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డులో వక్ఫ్ బోర్డు స్థలంలో ఆదివారం కొందరు బంకు ఏర్పాటు చేయడాన్ని వక్ఫ్‌బోర్డు సభ్యులు, జామీయ మసీదు సభ్యులు అడ్డుకున్నారు. వక్ఫ్‌బోర్డు స్థలంలో బంకు ఏర్పాటు చేయడాన్ని సభ్యులు వ్యతిరేకించారు. దీంతో వక్ఫ్‌బోర్డు సభ్యులకు, బంకు ఏర్పాటుదారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానికులు సర్దిజెప్పడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

ప్రయాణికుడికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం పెచ్చులూడి మీద పడటంతో బొమ్మిరెడ్డి అనే ప్రయాణికుడు గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. యాడికి మండలం కేశవరాయుని పేటకు చెందిన బొమ్మిరెడ్డి బస్సులో పని మీద గుత్తికి వచ్చాడు. బస్టాండ్‌లో దిగి టాయిలెట్ కోసం మరుగు దొడ్డి వైపు వెళుతున్న సమయంలో బస్టాండ్ పై కప్పు పెచ్చులూడి మీద పడ్డాయి . గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువకుని నిజాయితీ



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న యువకుడు

పామిడి: దారిలో చిక్కిన సెల్‌ఫోన్‌ను ఆదివారం పోలీసుల సమక్షంలో బాధితుడికి అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడో యువకుడు. వివరాలు ఇలా ఉన్నాయి. పీ కొండాపురం గ్రామానికి చెందిన యువకుడు గౌస్ పనిమీద పామిడికి వచ్చాడు. స్థానిక ఉట్లమాను వద్ద దారిలో పడిన ఉన్న సెల్‌ఫోన్‌ను గమనించాడు. దొరకిన రూ.20 వేలు విలువ చేసే సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించాడు. సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో స్థానిక బాధిత బేల్దారిబాషకు సెల్‌ఫోన్ అందజేశాడు. గౌస్ నిజాయితీని ఈసందర్భంగా సీఐ ప్రశంసించారు. గౌస్‌కు బాధితుడు బాష ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

గుత్తి: స్థానిక కటిక బజారులో నివాసముంటున్న ఖురేషి అన్వర్ గొర్రెల మందపై ఆదివారం కుక్కల గుంపు దాడి చేసింది. పది గొర్రెలు మృతి చెందాయి. రూ.లక్ష దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

ఘనంగా ఆరాధనోత్సవం

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దైవసేవకుడు బ్రదర్ బాబావలి ప్రసంగించారు. యెహోవా దేవుడు మానవులను పాప విముక్తి గావించడానికి యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చాడన్నారు. ఆయన అంతులేని సిలువ ప్రాణ త్యాగంతో పాపముక్తి లభించిందన్నారు. చర్చి సభ్యులు, వీరయ్య, జయరాజు, అబ్రహాం, బుజ్జిబాబు, కిష్టఫర్ బాబు, రవిరాజు, అరుణ్, ప్రసాద్, విజయభాస్కర్, రూఫస్, రూతు, మేరి, రజని, అనూష పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది



శింగనమలలో పోలింగ్ కేంద్రానికి వస్తున్న ఎన్నికల సిబ్బంది



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నిర్మలాకుమారి, తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎస్ఐ శ్రీనివాసులు

శింగనమల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సోమవారం జరగనున్న పోలింగ్ కోసం సిబ్బంది ఆదివారం సాయంత్రం ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. శింగనమల మండలంలో పట్టభద్రులు 963 మంది, 25 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఎస్ఐ శ్రీనివాసులు పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి అవసమైన ఏర్పాట్లు చేయించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు.

బుక్కరాయసముద్రం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ మోహన్‌కుమార్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో రెండు పట్టభద్రులు, ఒక టీచర్ ఎమ్మెల్సీ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో పట్టభద్రులు 1,642 టీచర్లు ఓటర్లు 83 మంది ఉన్నారని తెలిపారు.

గార్లదిన్నె: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ఉషారాణి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 2, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా 1,409 పట్టభద్రులు, 43 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

పుట్లూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ సుమతి పరిశీలించారు. సోమవారం ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలను ఆమె సిబ్బందికి వివరించారు. ఈమె వెంట డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్, వీఆర్‌ఓలు ఉన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా.. నమోనమః

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సుబ్రహ్మణ్యేశ్వరా.. నమోనమః అంటూ భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మొదటగా స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో రాహుకేతు హోమాలు చేశారు. ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతిదేవికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.



స్వామి మూలవిరాట్‌కు హారతి ఇస్తున్న అర్చకులు

హనుమద్ వాహనంపై శ్రీవారు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరుడు

యల్లనూరు: మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటరమణస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన అర్చకుడు విజయ్ ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామికి పూజలు, అర్చనలు అభిషేకాలను నిర్వహించారు. సాయంత్రం హనుమద్ వాహనంపై స్వామి ఉత్సవిగ్రహాన్ని ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఉత్సవాలను ఈఓ శోభారాణి పర్యవేక్షించారు.

న్యాయం చేయండి

బుక్కరాయసముద్రం: ఇళ్లు లేని తాము గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తుంటే ఆ స్థలం తమదంటూ గుడిసెలు కూల్చివేశారని బాధితులు ఆదివారం అనంతపురం డీఎస్పీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులమైన 21 మందికి సర్వే నంబర్ 2 లోని భూమిలో రెవెన్యూ అధికారులు ఇంటి పట్టాలు ఇచ్చారన్నారు. అయితే ఈభూమిని తమదంటూ ఓ వ్యక్తి దౌర్జన్యంగా కూల్చివేశారన్నారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో యల్లన్న, రామాంజినేయులు, లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



పెద్దవడుగూరులో సిబ్బందికి సూచనలిస్తున్న పోలీస్ అధికారి



తాడిపత్రి టౌన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

తాడిపత్రి టౌన్: పట్టణంలో సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఎన్నికలు జరగనున్నాయని, ఓటర్ల తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ మునివేలు కోరారు. తాడిపత్రిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడు పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం ఎన్నికల అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓటు వినియోగించుకోవటానికి వచ్చే ఓటరు ఏదేని గుర్తింపు కార్డుతో రావాలన్నారు. తాడిపత్రి పట్టణ, రూరల్ పరిధిలో పట్టభద్రులు 5,794 మంది, ఉపాధ్యాయులు 645 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

పెద్దవడుగూరు : స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ఈరమ్మ, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఓటర్లు తప్పకుండా ఐడీ ప్రూఫ్ తప్పకుండా తీసుకురావాలని సూచించారు.

యాడికి: స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎస్ఐ తమ పోలీసు సిబ్బందికి ఎన్నికల విధులపై పలు సూచనలు చేశారు.

సంతల ద్వారా రూ.3.47 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రూ.3.47 లక్షలకు పైగా ఫీజు వసూలైనట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.1,90,130 కాగా ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1.57 లక్షలు మేర ఆదాయం వచ్చిందన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు వేళాయె

- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఓటు వేసే అవకాశం

గుంతకల్లు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిగే పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా కేంద్రాల వద్ద కనీస వసతులు కల్పించారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలో 8 మండలాల్లో పట్టభద్రులు 16,490, ఉపాధ్యాయులు 1,318 మంది మంది ఓటర్లు ఉన్నారు. పట్టభద్రుల కోసం 18 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయులకు 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద భారీ స్థాయిలో పోలీసులను మోహరింపజేశారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్‌లోని గుంతకల్లు, గుత్తి, పామిడి, పెద్దవడుగూరు, ఉరవకొండ. వజ్రకరూర్, విడపనకల్లు, యాడికి మండలలో సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, మహిళ పోలీసులు, హోంగార్డులతోపాటు స్పెషల్ ఫోర్స్, రిజర్వ్‌డ్ పోలీసులతో బందోబస్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆర్డీఓ రవీంద్ర, డీఎస్పీ నర్సింగప్ప ఇతర అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బందోబస్తులో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గుంతకల్లు డివిజన్ పరిధిలో ఆయా పోలింగ్ సిబ్బందికి ఆదివారం సాయంత్రం ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్ పురపాలక బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

పట్టుభద్రులకు 18, ఉపాధ్యాయలకు 8 కేంద్రాలు

గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 8 మండలలో పట్టుభద్రులు,ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు దాదపు 26 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టుభద్రల కొరకు అత్యంధికంగా గుంతకల్లు 6 కేంద్రాలు, గుత్తిలో 5, పామిడి 2, పెద్దవడగూరు 1, ఉరవకొండలో 2, వజ్రకరూరు, విడపనకల్లు, యాడకిలో ఒక్కో కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధింది మండల కేంద్రాల్లో ఒక్కో కేంద్రం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రశాంతంగా ఎన్నికలు



గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 8 మండలాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశాం. ఓటర్లు ప్రభుత్వం సూచించిన ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్ట్ కార్డులలో ఏదో ఒకటి పోలింగ్ కేంద్రంలో చూపించి ఓటింగ్‌లో పాల్గొనవచ్చు.

– రవీంద్ర, ఆర్డీఓ, గుంతకల్లు

కేంద్రాల వద్ద బందోబస్తు



గుంతకల్లు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఉపాధ్యాయ, పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశాం. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. కేంద్రాలకు ఇరువైపులా 100 మీటర్ల దూరం ఉండేలా మార్కింగ్ చేశాం. దాదపు 273 మంది పోలీసు సిబ్బందిని కేటాయించాం. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలి.

–నర్సింగప్ప, డీఎస్పీ గుంతకల్లు